
సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



బేనీషా డీలా.. పునాసా భళా!

బేనీషా మామిడి పండ్లకు మార్కెట్‌లో డిమాండ్ తగ్గి రైతులు డీలా పడుతున్నారు. దిగుబడులు వస్తున్నా ఆదాయం లేకపోవడంతో.. పునాసా, రుమాణి రకాలపై మొగ్గు చూపుతున్నారు. -8లో



గెలుపు, ఓటమి సమానంగా తీసుకోవాలి

క్రీడల్లో గెలుపు, ఓటమి సమానంగా తీసుకోవాలని జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ గోవిందరావు పేర్కొన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.290	రూ.340
రెండోరకం	రూ.200	రూ.268

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 602 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	325	325
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 46.220 కిలోలు

న్యూస్‌రీల్

నిరక్షరాస్యత నిర్మూలనకు ఓపెన్ స్కూళ్లు



ఓపెన్ స్కూల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి టౌన్: నిరక్షరాస్యత నిర్మూలన కోసం ప్రభుత్వం ఓపెన్ స్కూల్ ద్వారా అవకాశాన్ని కల్పించిందని అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఓపెన్ స్కూల్ కో– ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజుతో కలసి ఓపెన్ స్కూళ్ల అవశ్యకతను తెలిపే పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ కారణాల చేత అనేక సందర్భాలలో చదువును మధ్యలోనే మానేసిన వారు ఉంటారన్నారు. వారికి విద్య అవసరం అయినా అవకాశాలు లేక ఆగిపోయి ఉంటారన్నారు. అలాంటి వారికి ఈ ఓపెన్ స్కూల్ విద్య చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. మధ్యలో చదువు మానేసిన వారిని ఈ ఓపెన్ స్కూల్‌లో చేర్పించి నిరక్షరాస్యత నిర్మూలనలో జిల్లాను మొదటి వరుసలో నిలపాలని కోరారు.

ఉత్తమ పద్ధతులతో అధిక దిగుబడి



సంబేపల్లె మండలంలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జేడీఏ చంద్రానాయక్

సంబేపల్లె: మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉత్తమ వ్యవసాయ పద్ధతులు ఆచరించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో చర్చాగోష్టి నిర్వహించి దేవపట్ల, రెడ్డివారిపల్లెలలో రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులు పంటలు పండించి తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. అనంతరం ఏడీఏ శ్రీలత ఆధ్వర్యంలో పొలంబడి, గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ ఉమాపతి, ఏఈఓ రెడ్డి వెంకటరమణ, జెడ్పీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఖుల్ జా.. సిమ్ సిమ్

ఒకప్పుడు టెలికాం రంగంలో మకుటం లేని మహారాజుగా వెలుగులీని.. ఆ తర్వాతి కాలంలో కళా విహీనంగా మారిన ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ ఇప్పుడిప్పుడు తన నెట్‌వర్క్ సేవల్ని విస్తరిస్తోంది. ఇప్పటికే 4జీ నెట్‌వర్క్ సేవలను కొన్ని ప్రాంతాల్లో అందుబాటులోకి తీసుకొచ్చిన టెలికాం సంస్థ తాజాగా తన 5జీ సేవల ట్రయల్స్‌ను ప్రారంభించింది. మరోవైపు ప్రైవేటు రంగ టెలికాం సంస్థల్లో ఆధిపత్య ధోరణులు, పెరిగిన టారిఫ్ తదితర కారణాలతో ఎక్కువ మంది యూజర్ల చూపు బీఎస్ఎన్ఎల్ వైపు మరలుతోంది.

- జిల్లాలో 4జీ సేవలను విస్తరిస్తున్న బీఎస్ఎన్ఎల్
- తొలుత రాజంపేట, రాయచోటి పట్టణాల్లో ప్రారంభించేలా చర్యలు
- సెప్టెంబరు నాటికి 75 శాతం 4జీ సేవలు అందుబాటులోకి తెచ్చేలా కసరత్తు
- ఇటీవల టారిఫ్‌ను భారీగా పెంచిన ప్రైవేటు సంస్థలు
- దీంతో బీఎస్ఎన్ఎల్ వైపు అడుగులేస్తున్న వినియోగదారులు
- పడిలేచిన కెరటంలా పరుగెడుతున్న ప్రభుత్వ రంగ సంస్థ



1,15,000 జిల్లాలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు:

7325 జులై నుంచి ఇప్పటివరకు కొత్తగా వచ్చిన దరఖాస్తులు:

6315 ఫైబర్ నెట్ కనెక్షన్లు:

190 జిల్లాలో ఉన్న బీఎస్ఎన్ఎల్ టవర్లు:

70 కొత్తగా నిర్మాణంలో ఉన్న టవర్లు

సాక్షి, రాయచోటి: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ పునర్వైభవాన్ని సంతరించుకునే దిశగా అడుగులు వేస్తోంది. ప్రధానంగా ఇటీవల ప్రైవేటు టెలికాం సంస్థలు టారిఫ్ రేట్లను అధిక మొత్తంలో పెంచడంతో వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ వైపు చూసేలా చేసింది. గతంలో ఎన్నడూ లేని తరహాలో బీఎస్ఎన్ఎల్ కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రైవేటు టెలికాం సంస్థలకు దీటుగా 4జీ సేవలను కూడా ఒక వైపు విస్తరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. జిల్లాలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో సైతం అద్భుతమైన సేవలు అందించేలా 4జీతోపాటు 5జీ సేవలు అందించేందుకు కూడా సన్నాహాలు మొదలు పెట్టనున్నారు.

పెరుగుతున్న వినియోగదారులు

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఆరు నియోజకవర్గాల్లో సుమారు 1,15,000 వరకు బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఉన్నారు. ల్యాండ్‌ఫోన్లు, బ్రాడ్‌బ్యాండ్ సర్వీసులతో పాటు 12 వేలకు పైగా ఫైబర్ కనెక్షన్లు కూడా వస్తున్నాయి. ప్రైవేటుకు దీటుగా ఇంటర్నెట్‌తోపాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తూ వినియోగదారులను సంస్థ ఆకర్షిస్తోంది. దీంతో ఇతర కంపెనీలకు చెందిన వారు కూడా చిన్నగా ఇటు వైపు మారుతున్నారు. ఒక్క జులై నెలలోనే కొత్తగా బీఎస్ఎన్ఎల్ సిమ్‌లు తీసుకునేందుకు సుమారు ఐదు వేల దరఖాస్తులు వచ్చాయి. సాధారణంగా నెలకు 1500 కనెక్షన్లు మాత్రమే సరాసరిన వచ్చే పరిస్థితి నుంచి అదనంగా 3500 ఇతర జియో, ఎయిర్‌టెల్, ఐడియా కంపెనీల నుంచి వచ్చాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో 4జీ సేవలు

అన్నమయ్య జిల్లాలో ఇప్పటికే రాజంపేట, రాయచోటి ప్రాంతంలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు విస్తరించింది. రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరులలో సుమారు 180 వరకు టవర్లు ఉండగా, కొత్తగా మదనపల్లె డివిజన్‌లో 40 స్థలాలను ఎంపిక చేసి 12 శ్యాచురేషన్ 4జీ టవర్లను అందుబాటులోకి తెచ్చారు. అలాగే రాయచోటి, రాజంపేట ప్రాంతాల్లో కూడా 17 టవర్ల ద్వారా 4జీ సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం పనులు జరుగుతున్న టవర్లకు సంబంధించి కూడా సెప్టెంబరు నాటికి పనులు పూర్తి చేసి పూర్తిస్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో సైతం 4జీ సేవలు అందేలా చర్యలు చేపడుతున్నారు. 2025 నాటికి 5జీ సేవలు కూడా అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో అడుగులు వేగంగా పడుతున్నాయి.



సంస్థ పేరు	28రోజులు/ 1.5జీబీ/డే	28రోజులు/ 2జీబీ/డే	28రోజులు/ 2.5జీబీ/డే	ఏడాదికి
జియో	రూ.299	రూ.349	రూ.399	రూ.3599
ఎయిర్‌టెల్	రూ.299	రూ.349	రూ.399	రూ.3599
వొడా	రూ.299	రూ.349 (3జీబీ/డే)	-	-
బీఎస్ఎన్ఎల్	రూ.187	రూ.347 (54రోజులు)	-	రూ.2,399

టారిఫ్‌లలో టాప్‌గేర్



భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ సంస్థ టారిఫ్ విషయంలో టాప్‌గా నిలుస్తోంది. జిల్లాలో బీఎస్ఎన్ఎల్ సంస్థ వినియోగదారులకు అత్యుత్తమ టారిఫ్‌లను అందిస్తోంది. కేవలం రూ. 107లకు వాయిస్ కాల్స్ అందిస్తూ నెలరోజుల ప్లాన్ అమలు చేస్తుండగా, 149తో 28 రోజులపాటు 2జీబీతోపాటు అన్ లిమిటెడ్ కాల్స్‌ను అందిస్తోంది. అంతేకాకుండా రూ. 249 ప్లాన్ ప్రకారం 45 రోజుల ప్లాన్ అందిస్తోంది. దీని ప్రకారం 100 ఎస్ఎంఎస్‌లు, అన్ లిమిటెడ్ కాల్స్, 2జీబీ డేటాను అందిస్తుండడంతో అందరి దృష్టి బీఎస్ఎన్ఎల్‌పై మళ్లింది. మరోవైపు మిగతా ప్రైవేటు రంగ సంస్థలకు సంబంధించి రూ. 290లకుపైగా చెల్లిస్తే తప్ప నెలవారి టారిఫ్ అందించడం లేదు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రైవేటు కంపెనీల వినియోగదారులు కూడా టారిఫ్ టాప్‌గా అందిస్తున్న బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపుతున్నారు.

మెరుగైన సేవలు



జిల్లాలో వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే కాకుండా తక్కువ టారిఫ్‌తో సేవలు అందిస్తున్నాం. ప్రైవేటు టెలికాం సంస్థలు ప్రజలపై మోయలేని భారాన్ని వేస్తున్నాయి. ఎప్పటికప్పుడు మారుతున్న కాలానికి అనుగుణంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను విస్తరిస్తున్నాం. ఇప్పటికే అనేకచోట్ల 4జీ సేవలకు సంబంధించిన టవర్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల వారికి సైతం నాణ్యమైన సేవలు అందేలా కసరత్తు చేస్తున్నాం. ఇటీవల బీఎస్ఎన్ఎల్ సంస్థ అందిస్తున్న సేవలను గుర్తించి ప్రజలు కూడా విశేషంగా ఆదరిస్తున్నారు.

– షేక్ ముజీబ్ పాషా, జనరల్ మేనేజర్, బీఎస్ఎన్ఎల్, ఉమ్మడి వైఎస్సార్ జిల్లా

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వాడుకలోకి తేవాలి

జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పూర్తిగా వాడుకలోకి తేవాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. గురువారం డీపీఓ ధనలక్ష్మితో కలిసి పంచాయతీల అభివృద్ధిపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో 501 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో 439 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయన్నారు. వాటన్నింటిని పూర్తిగా వాడుకలోకి తేవాలని ఆదేశించారు. అన్ని కేంద్రాల వద్ద పంచాయతీ పేర్లను ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రాలకు అవసరమైన రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. విస్తరణాధికారులు తరచూ కేంద్రాలను సందర్శించి వాటి పనితీరును మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న క్లాప్ మిత్రల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని ఆదేశించారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

రాయచోటి : జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పేదలందరికీ ఇళ్ల నిర్మాణం పథకంపై సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, హౌసింగ్ శాఖ సిబ్బంది తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అన్నమయ్య జిల్లాలో 78221 ఇళ్లను ప్రభుత్వం కేటాయించిందని కలెక్టర్ చెప్పారు. ఇందులో 82 శాతం గ్రౌండింగ్ అయ్యాయని, మిగతా వాటిని త్వరగా గ్రౌండింగ్ చేయాలన్నారు. నియోజకవర్గాల వారీగా ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. జాయింట్ కలెక్టర్, రాజంపేట, మదనపల్లి సబ్ కలెక్టర్లు, రాయచోటి ఆర్డీఓలు వారంలో మూడు సార్లు ఇళ్ల నిర్మాణంపై సమీక్షించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లి, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కొరవడి.. వెనుకబడి



వీవీ కండ్రిక మండల పరిషత్ పాఠశాల



మరుగుదొడ్డికి తెరలే తలుపులు

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు మండలం వీవీ కండ్రిక మండల పరిషత్ పాఠశాల పరిస్థితి అధ్వానంగా తయారైంది. గత ఏడాది 25 మందికి పైగా విద్యార్థులు ఉండేవారు. ఈ ఏడాది ఆరుగురు మాత్రమే మిగిలారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయుడిగా కడపకు చెందిన ఖాదర్ మస్తాన్, ఉపాధ్యాయురాలు అమ్మన్ని విధులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయురాలు లీవులో ఉన్నారు. ప్రధానోపాధ్యాయుడు అందుబాటులో ఉండరు. ఎప్పుడొస్తారో తెలియదు. పక్కనే గిరిజన కాలనీలో పిల్లలు పాఠశాలలో చేరేందుకు సిద్ధంగా ఉన్నా.. చేర్పించుకోవడానికి సదరు ప్రధానోపాధ్యాయుడు సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. పాఠశాల నాడు–నేడుకు ఎంపికైనా పనులు జరగలేదు, మరుగుదొడ్లకు తలుపులు లేవు. తెరగుడ్డలే వాడుతున్నారు. విద్యాకానుక అందలేదు. దీనికి తోడు యూనిఫాం కిట్లు, ఎంతో విలువైన బోర్డు, పరికరాలు మూలన పడి ఉన్నాయి. తాగునీటి సౌకర్యం లేదు. పాఠశాల దుస్థితి గురించి అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎంఈఓ ఏమంటున్నారంటే.. 'ప్రధానోపాధ్యాయుడు సెలవు పెడుతున్నట్లు సమాచారం ఇవ్వలేదు. ఇంత వరకు అధికారికంగా సెలవు పెట్టలేదు. ఇరువురు అందుబాటులో లేకపోవడంతో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ద్వారా పిల్లలకు విద్యా బోధన చేస్తున్నాం. నాడు నేడు పనులను సక్రమంగా ఆన్‌లైన్ చేయక కుంటుపడ్డాయి. ఆ పాఠశాలపై స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయి'.. అని వివరించారు.



పాఠశాలలో విద్యార్థులు



మూలన పడిన పరికరాలు



పంపిణీ చేయని యూనిఫాం



విద్యార్థులకు ఇవ్వని పుస్తకాలు

నిధులు లేవు.. నీళ్లు రావు.!

- రూ.1,269 కోట్లు అడిగితే.. రూ.644 కోట్లిచ్చారు
- హంద్రీ–నీవాకు ఓటాన్ బడ్జెట్‌లో కేటాయింపు
- పెండింగ్ బిల్లులే రూ.350 కోట్లు
- రైతాంగం ఆశలన్నీ పుంగనూరు కాలువ విస్తరణ పనులపైనే
- ఇది పూర్తయితేనే మూడు రిజర్వాయర్లకు కృష్ణా జలాలు
- లేదంటే రైతాంగం కరువు కోరల్లోనే



హంద్రీ–నీవా పుంగనూరు ఉపకాలువ

బి.కొత్తకోట: కరువు రైతాంగానికి ఏకైక ఆశాకిరణం ఏపీఆర్ హంద్రీ–నీవా సాగు, తాగునీటి ప్రాజెక్టు. ఇది మినహా మరో భారీ సాగునీటి ప్రాజెక్టు లేదు. కరువు ప్రాంతమంతా దీనిపైనే ఆధారపడింది. ఈ పరిస్థితుల్లో ప్రాజెక్టులో మిగిలిపోయిన పనులను సత్వరమే పూర్తి చేయించి రైతాంగానికి సాగునీరు, ప్రజలకు తాగునీటిని అందించాల్సి ఉంది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రాజెక్టు పనులపై దృష్టి సారించి పూర్తి చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా బడ్జెట్‌లో ఉన్నతాధికారుల ప్రతిపాదిత నివేదిక ఆధారంగా నిధులు కేటాయించి పనులను పరుగులెత్తించాలి. అయితే ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ కాకుండా ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పెట్టడంతో రైతుల్లో కొంతమేర ఆశలు సన్నగిల్లాయి. ప్రాజెక్టు పనులు చేపడ్తారా లేదా అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

విస్తరణ జరక్కుంటే కష్టాలే..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో (ప్రస్తుత అన్నమయ్య, చిత్తూరు) సాగే హంద్రీ–నీవా ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులు ముందుకు సాగకుంటే తీవ్రంగా నష్టపోయేది రైతాంగమే. లక్షల మంది రైతులు సాగునీటి కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు మూడుసార్లు కృష్ణా జలాలను తరలించారు.110 చెరువులను నింపడమేకాక పుంగనూరు, మదనపల్లె పట్టణాల ప్రజలకు తాగునీటిని అందించడం కోసం సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను కృష్ణా జలాలతో నింపారు. ఈ ఏడాది కృష్ణా జలాలను రప్పిస్తారో లేదో తెలియదు. కాగా పెద్దతిప్పసముద్రం మండలం పులికల్లు పంచాయతీలోని సీవీ రామన్నగారిపల్లె వద్ద కిలోమీటర్ 79 నుంచి పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం తిమ్మిరెడ్డిపల్లె వద్ద 220.350 కిలోమీటర్ వరకు పుంగనూరు ఉపకాలువ 140.75 కిలోమీటర్లు సాగుతుంది. కాలువ కుడివైపున అదనంగా 4.8 మీటర్లు విస్తరిస్తారు. దీనికి అనుగుణంగా ఎత్తిపోతల పథకాలను కూడా విస్తరిస్తారు. ప్రస్తుత కాలువ నీటి ప్రవాహ సామర్థ్యం 380 క్యూసెక్కులే. మరో 800 క్యూసెక్కులకు ప్రవాహం పెంచి 1,180 క్యూసెక్కుల సామర్థ్యానికి సిద్ధం చేయాలి.

మూడు రిజర్వాయర్లు ఆధారపడ్డాయి..

పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులు పూర్తయ్యాక వైఎస్సార్ జిల్లాలోని గండికోట ప్రాజెక్టు నుంచి జిల్లాకు 1,550 క్యూసెక్కుల నీటిని తరలిస్తారు. గండికోట నుంచి చక్రాయపేట మీదుగా జిల్లాలోని పెద్దతిప్పసముద్రం మండలంలోని సీవీ రామన్నగారిపల్లె వద్ద కిలోమీటర్ 79 వద్దకు పుంగనూరు ఉపకాలువలోకి 800 క్యూసెక్కుల నీటిని, 750 క్యూసెక్కుల నీటిని పెద్దమండ్యం మండలం మీదుగా సాగే హంద్రీ–నీవా ప్రధాన కాలువకు తరలిస్తారు. 800 క్యూసెక్కుల కృష్ణా జలాల్లో కొత్తగా నిర్మిస్తున్న ముదివేడు రిజర్వాయర్‌కు 200, నేతికుంటపల్లె రిజర్వాయర్‌కు 100, ఆవులపల్లె రిజర్వాయర్‌కు 350 క్యూసెక్కుల నీటిని తరలిస్తారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కరువు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిల కృషితో గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుంగనూరు ఉపకాలువ విస్తరణ, మూడు రిజర్వాయర్లు మంజూరు చేసి నిధులు కేటాయించారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ పనులపై దృష్టిపెట్టి రైతాంగానికి ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

చాలా అడిగారు..

హంద్రీ–నీవా ప్రాజెక్టు పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నిధుల అవసరం గుర్తు చేస్తూ నివేదిక అందించారు. ప్రాజెక్టు పరిధిలోని ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలో 12 డివిజన్ కార్యాలయాలు, మూడు ఎస్ఈ కార్యాలయాలు పనిచేస్తున్నాయి. వీటి పరిధిలో ప్రధాన, ఉపకాలువలు, ఎత్తిపోతల పథకాలు, దీనికి అనుబంధంగా మంజూరైన కొత్త పథకాలు, ఇలా ఎన్నో పనులు సాగుతున్నాయి. ప్రధానంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఒప్పందం పూర్తయిన పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులు రూ.1,219.9 కోట్లతో చేపట్టారు. ఇదికాక ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రధాన కాలువ విస్తరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సాధారణంగా జరగాల్సిన పనులతోపాటు సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు తీసుకెళ్లే కుప్పం ఉపకాలువ పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఇలా ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు రూ.1,269 కోట్లు ఈ బడ్జెట్‌లో కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

సగమిచ్చారు..


ప్రాజెక్టుకు రూ.1,269 కోట్లు కావాలని విన్నవిస్తే ప్రభుత్వం రూ.644.51 కోట్లు కేటాయించింది. ఈ నిధుల్లో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది వేతనాలు, తరా ఖర్చులు కూడా ఇందులోంచే చెల్లించాలి. పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులు చేపట్టాలంటే అందుకు పుష్కలంగా నిధులు కేటాయించాల్సి ఉంది. ఇప్పటికే కొంతమేరకు పనులు చేసిన పుంగనూరు కాలువ విస్తరణ పనుల కాంట్రాక్టర్‌కు రూ.117 కోట్లు చెల్లించాల్సి ఉంది. మదనపల్లె చిప్పిలి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు పనులు చేస్తున్నందున ఈ బిల్లు పెండింగ్‌లో ఉంది. అలాగే కుప్పం ఉపకాలువ పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌కు రూ.49 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితోపాటు ప్రాజెక్టు మొత్తానికి కలుపుకొని ప్రస్తుతానికి రూ.350 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని చెల్లించాల్సి ఉన్నందున ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కేటాయించిన రూ.644 కోట్లలో సగానికిపైగా పెండింగ్ బిల్లులకే సరిపోతుంది. ఇక జరిగే పనులకు చెల్లింపులు ఎలా? నిధులు అందుబాటులో లేకుంటే పనులు పూర్తి చేసేదెలా అన్నది అధికార వర్గాల ప్రశ్న. ఇలాంటి పరిస్థితుల్లో ప్రాధాన్య క్రమంలో ప్రాజెక్టు పనులు పూర్తి చేయించడానికి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయని అంటున్నారు.

ఘనంగా అవధూత ఆరాధన


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్ : మండలంలోని కూచివారి పల్లెలో నూతనంగా నిర్మించిన మండపంలో శివైక్యమైన అవధూత ఆరాధన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది జూన్ 29న జడల స్వామి శివైక్యం చెందారు. గురువారం నాటికి 40 రోజులు కావడంతో భక్తులు పెద్దఎత్తున ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామునే భక్తులు, సాధువులు కీర్తనలు, భజనలు ఆలపించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పలు పూజలు జరిపారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పాల్గొని మండపం వద్ద పూజల్లో పాల్గొన్నారు. నెల్లూరుకు చెందిన సీతామహాలక్ష్మి సత్సంగం చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విద్యా సంస్థల అధినేత పోలా వెంకటరమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు రెడ్డిమాసి రమేష్‌నాయుడు, జేసీబీ శివారెడ్డి, కసిరెడ్డి రాజారెడ్డి, జీవీ.సుబ్బరాజు, దాసరి పెంచలయ్య, దండు గోపి పాల్గొన్నారు.

ప్రకృతి చిత్రం గీసింది..



కడప నగర సమీపంలోని బుగ్గ వంక ప్రాజెక్టు వద్ద ప్రకృతి అందాలు ఆకట్టుకుంటున్నాయి. సహజ సిద్ధ అందాలకు నెలవైన కొండ ప్రాంతాల నడుమ రమణీయమైన దృశ్యాలు.. కొండను తొలిచినట్లుగా రాళ్లు.. వాటి మధ్య జాలవారుతున్న జల సవ్వళ్లు మైమరపిస్తున్నాయి. ఆదివారం ప్రాజెక్టు సందర్శనకు అధిక సంఖ్యలో తరలివచ్చిన జనం ఈ అందాలను తమ చరవాణీల్లో బంధించారు. అక్కడే దోటీలు వేసి చేపల వేట కొనసాగించారు.

– చింతకొమ్మదిన్నె

దివ్య పుష్పం.. వికసించింది

అరుదుగా కొన్ని జాతులకు చెందిన పూలు ఏడాదికోసారి మాత్రమే వికసిస్తాయి. ప్రధానంగా పౌర్ణమి తర్వాత వికసించే పుష్పం.. బ్రహ్మకమలం. ఏటా వర్షాకాలంలో వికసించే ఈ పూలను భక్తులు ప్రత్యేకంగా పూజిస్తారు. మండలంలోని కలకడ టౌన్ త్రికూటమి సారథి స్వామి పెరటి తోటలోనూ, యర్రయ్యగారిపల్లెలోని రామక్రిష్ణ ఇంట్లోనూ బ్రహ్మకమలం పుష్పం వికసించింది. స్థానికులు ఆసక్తిగా తిలకించి పూజలు చేశారు.

– కలకడ



ఊసరవెల్లి కనిపించింది

ఊసర వెల్లులు రక్షణ కోసం తమ రంగు మారుస్తాయని చెబుతారు. వేటాడే జంతువుల నుంచి రక్షణకు తమ ఎరను కలవరపెట్టడానికి ఇలా రంగు మారుస్తాయి. తన శరీరానికి ఫొటోనిక్ క్రిస్టల్ అని పొర ఉంటుంది. ఇది పర్యావరణానికి అనుగుణంగా రంగు మార్చడానికి సహాయ పడుతుంది. ఇలాంటివి అరుదుగా కనిపిస్తుంటాయి. మదనపల్లె పట్టణం బెంగళూరు రోడ్డుపై గిలా ఊసరవెల్లి వెళ్తే కనిపించడంతో పలువురు తమ చరవాణుల్లో చిత్రాన్ని బంధించారు.

– మదనపల్లె సిటీ


రోడ్డుపై వెళ్తున్న ఊసరవెల్లి

మైనర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : తల్లిదండ్రులు చదువుకోమని మందలించడంతో మనస్తాపానికి గురైన మైనర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మదనపల్లె పట్టణంలో జరిగింది. చంద్రాకాలనీకి చెందిన ఓ మైనర్ విద్యార్థి(16) గత కొన్ని రోజులుగా కళాశాలకు సక్రమంగా వెళ్లకపోవడంతో గురువారం తల్లిదండ్రులు మందలించారు. మనస్తాపం చెందిన విద్యార్థి పురుగుమందు తాగి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స అనంతరం కోలుకుంటున్నాడు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్


సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

మదనపల్లె : నిమ్మనపల్లె మండలం నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. ఇసుక రవాణాపై రెవెన్యూ అధికారులకు సమాచారం అందడంతో బసినికొండ వద్ద తనిఖీలు చేపట్టారు. మూడు ట్రాక్టర్లలో తరలిస్తుండగా పట్టుకుని తాలూకా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రామయ్యను దర్శించుకున్న డీఆర్‌ఎం

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవాలయాన్ని గురువారం గుంతకల్ రైల్వే డివిజన్ డీఆర్‌ఎం విజయ్ కుమార్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు వారికి ఘన స్వాగతం పలికి ఆలయ ప్రదక్షణం గావించారు. అనంతరం డీఆర్‌ఎం దంపతులు ధర్మాలయంలోని మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగ మండపంలో సేద తీరిన వారికి ఆలయ అధికారులు సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.


కోదండరాముని సన్నిధిలో గుంతకల్ రైల్వే డివిజన్ డీఆర్‌ఎం విజయ్‌కుమార్

బాలల హక్కుల పరిరక్షణే ధ్యేయం

రాయచోటి అర్బన్ : బాలల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ సంస్థ సభ్యుడు రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా స్త్రీ, శిశుసంరక్షణ అధికారి కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి వరకూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. లైంగిక వేధింపులకు గురవుతున్న బాలల హక్కులకు భంగం కలగకుండా చూడాలని తెలిపారు. బాల్యవివాహాలు అరికట్టేందుకు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఐసీడీఎస్ అధికారిణి శశికళ మాట్లాడుతూ బాల్య వివాహాలతో కలిగే కష్ట నష్టాల గురించి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శివప్రకాష్‌రెడ్డి, జిల్లా బీసీ, సోషల్, మైనార్టీ, ట్రైబల్ వెల్ఫేర్, ఐసీడీఎస్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

ప్రేమ పెళ్లి చేసుకున్నాం.. రక్షణ కల్పించండి

వాల్మీకిపురం: 'ప్రేమించి పెళ్లి చేసుకున్నాం.. తల్లిదండ్రులు, బంధువుల నుంచి మాకు ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి' అంటూ జంట ప్రేమికులు యశ్వంత్, చరితలు తహసీల్దారు ఫిరోజ్‌ఖాన్, వాల్మీకిపురం సీఐ పులిశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. వాల్మీకీపురం తహశీల్దారు కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ తాము మేజర్లు కావడంతో.. పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్నామన్నారు. చరిత తల్లిదండ్రులు తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టారన్నారు. తన ఇష్టపూర్వకంగానే యశ్వంత్‌ను పెళ్లి చేసుకున్నానని, తాము క్షేమంగా ఉన్నామని తల్లిదండ్రులకు చరిత తెలిపారు. ఈ ప్రేమ జంటకు వాల్మీకిపురం ప్రజా సంఘాల నాయకులు శివయ్య, రఘు, శివ, హరి, అశోక్, చిన్నా, సాయి, కిరణ్, బబ్లూ, రెడ్డి, మణి, తదితరులు మద్దతుగా నిలిచారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న ప్రేమ జంట

బాలికను గాయపరిచిన కేసులో ఒకరికి ఏడేళ్ల జైలుశిక్ష

మదనపల్లె : మూడేళ్ల బాలికను గాయపరిచిన ఘటనకు సంబంధించి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలుశిక్ష, వేయి రూపాయల జరిమానా విధిస్తూ చిత్తూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్.శాంతి తీర్పు ఇచ్చినట్లు సీఐ యువరాజు తెలిపారు. పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన పుల్ల రమేష్ అలియాస్ తిరుపతి(41), అదే ప్రాంతానికి చెందిన మూడేళ్ల బాలికపై విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచాడన్నారు. 2017లో అప్పటి సీఐ హనుమంతునాయక్ కేసు నమోదుచేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. చిత్తూరు పోక్సో కోర్టులో కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ఎస్.శాంతి నిందితుడు పుల్ల రమేష్‌కు ఏడేళ్ల జైలుశిక్ష, వేయి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

గెలుపు, ఓటములు సమానంగా తీసుకోవాలి

మదనపల్లె సిటీ : క్రీడల్లో గెలుపు, ఓటమి సమానంగా తీసుకోవాలని జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ గోవిందరావు పేర్కొన్నారు. స్థానిక చిత్తూరు రోడ్డులోని నవోదయ విద్యాలయంలో జరుగుతున్న క్లస్టర్ స్థాయి క్రీడల పోటీలు గురువారం ముగిశాయి. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ప్రతి ఏడాది క్లస్టర్ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓవరాల్ ఛాంపియన్‌గా చిత్తూరు నవోదయ పాఠశాల నిలిచింది. విజేత జట్టు ఈ నెల 12న రీజనల్ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపల్ తెలిపారు.పీ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వేలాయుధన్, పీడీలు సురేంద్రరెడ్డి, కొరాయి, ఉపాధ్యాయులు లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకుంటున్న చిత్తూరు నవోదయ విద్యాలయం విద్యార్థులు

బెనీషా డీలా.. పునాసా భళా

ప్రపంచ దేశాలలో వీరబల్లె మామిడికి మంచి క్రేజ్ ఉంది. బేనీషా(బంగినపల్లి)గా పిలిచే ఈ రకం మామిడి పండ్లకు తాజాగా డిమాండ్ కాస్త తగ్గి రైతు డీలా పడుతున్నాడు. ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తున్నా ఆదాయం లేకపోవడంతో.. పునాసా, రుమాణి రకాలపై మొగ్గు చూపుతున్నారు. రెండున్నరేళ్లకు దిగుబడులు రావడంతో భళా అనిపిస్తున్నారు.

- కొత్త రకం మామిడి మొక్కలు నాటేందుకు రైతుల ఆసక్తి
- అన్నమయ్య జిల్లాలో 300 ఎకరాల్లో తోటల సాగు
- మొక్క నాటిన రెండేళ్లకే మామిడి దిగుబడులు


వేరుశనగ పొలంలో విరగకాసిన పునాసా రకం మామిడి కాయలు


విరగకాసిన రుమాణి రకం మామిడి

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లాలోనే అధికంగా పండే పంట మామిడి. రాయచోటి, గాలివీడు, చిన్నమండ్యం, మదనపల్లె. ఆర్.కోడూరు ప్రాంతాల్లో దాదాపు 60 వేల ఎకరాలకు పైగా మామిడి సాగు చేస్తారు. వీటిలో వీరబల్లె మండలంలో పండే మామిడికి విపరీతమైన డిమాండ్ ఉంది. అయితే ఇటీవల క్రిమిసంహారక మందులు వాడుతున్నారని, మందులు పెట్టి పక్వం చెందిస్తున్నారనే ప్రచారంతో ఈ మామిడికి కాస్త ఆదాయం తగ్గింది. అయినా రైతుకు మామిడిపై మమకారం తీరకపోవడంతో.. అధికారుల సలహాలతో శాస్త్రీయంగా ఆలోచించి.. మార్కెట్లో డిమాండ్ ఉన్న మామిడి తోటల సాగు వైపు అడుగులు వేస్తున్నారు. ఏడాదంతా కాపు కాసే వెరైటీల వైపు మొగ్గు చూపుతున్నారు.

పునాసా, రుమాణి రకాలకు డిమాండ్

రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్న మామిడి రకాలు పునాసా, రుమాణి. వాటిలో పునాసా మామిడి రకాలను రాయలసీమ స్పెషల్‌గా పిలుస్తారు. ఈ ఏడాది జిల్లాలో 300 ఎకరాలకు పైగా ఈ రకం మామిడి సాగు చేశారు. ఏడాది పొడవునా పునాసా రకం మామిడి తోటల్లో ఏడాదికి రెండు సార్లు కచ్చితంగా కాయల దిగుబడి వస్తుంది. సీజనల్‌గా జనవరిలో పూత వచ్చి మార్చి-ఏప్రిల్ నెలలో దిగుబడి పూర్తవుతుంది. వెంటనే మే ఆఖరు నుంచి మళ్లీ కాయలు కాస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ఈ రకం మామిడి కాయలు(పండ్లు) మార్కెట్‌లోకి వచ్చాయి. వినియోగదాలు నేరుగా తోటల వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. తొలి కాపులోనే (రెండున్నర సంవత్సరాల వయసు మొక్కలు) ఎకరానికి రూ.30 వేలకు తగ్గకుండా దిగుబడి వస్తోందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండేళ్లు దాటితే ఎకరాకు కనీసం రూ.50 వేలు తగ్గకుండా వస్తుందని రైతులు చెబుతున్నారు.

కొత్త రకాలపై రైతులు మొగ్గుచూపుతున్నారు

కొత్త రకాలపై ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. రెండేళ్లుగా ప్రత్యామ్నాయ మామిడి పంట సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో 300 ఎకరాల కన్నా ఎక్కువగా సాగవుతోంది. దిగుబడి పొందిన రైతులు ఆదాయం గడిస్తున్నారు. ధర లేకపోయినా జులై-ఆగస్టులో వచ్చే దిగుబడికి మంచి డిమాండ్ ఉంది. మూడున్నర సంవత్సరాల తర్వాత ఎకరాకు కనీసం 2-3 టన్నులు దిగుబడి వస్తుంది. అప్పటి ధరల ఆధారంగా ఎకరాకు రూ.50 వేలు లాభం తప్పనిసరి.

- రవిచంద్రబాబు, ఉద్యాన శాఖ అధికారి, అన్నమయ్య జిల్లా

నాలుగు ఎకరాల్లో సాగు చేశాను



నాకు ఉన్న పొలంలో తొలిసారిగా రెండు ఎకరాల్లో ఈ పునాసా రకంతోపాటు రుమాణి రకం సాగు చేశాను. మళ్లీ సంవత్సరం తర్వాత మరో రెండు ఎకరాల్లో పంట సాగు చేశాను. మొదటి తోటలోని మొక్కలకు ప్రస్తుత వయస్సు రెండున్నర సంవత్సరమే. గత 15 రోజులుగా పునాసా కాయలు ఊర గాయ పచ్చళ్ల కోసం వినియోగదారులు కిలో రూ.50తో కొంటున్నారు. ఇప్పటికే సుమారు 500 కిలోలు విక్రయించాను. ఇంకా 500 కిలోల వరకు ఉండొచ్చు. సేంద్రీయ పద్ధతిలో సాగుచేస్తున్నా. ఈ ఏడాది నాకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు లాభం వస్తుంది.

- తాతయ్య, రైతు, రాయచోటి

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా


మదనపల్లె ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు

మదనపల్లె : ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందిపడుతున్నారని ఐటీయూసీ నాయకుడు కృష్ణమూర్తి అన్నారు. జిల్లా ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ భవనం ఎదుట పారిశుద్ధ్య కార్మికులు గురువారం ప్లకార్డులు చేతపట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ గత ఐదు నెలలుగా ప్రభుత్వం, ఔట్ సోర్సింగ్ సంస్థ నిర్లక్ష్యం కారణంగా తమకు వేతనాలు అందలేదన్నారు. 400 పడకల బోధనాసుపత్రిలో నేడు 27 మందితోనే సేవలు చేయించుకుంటున్నారన్నారు. వేతనాలు చెల్లించే వరకూ విధులు బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, పార్వతి, గంగారాణి, షాహిదా, శాంత, ధనలక్ష్మి, రేణుక, అంజనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటకు వెళ్లనన్న డీఎస్పీ

రాజంపేట : రాజంపేట సబ్ డివిజన్ డీఎస్పీగా వెళ్లనని ప్రభుత్వ నియమకాన్ని ప్రకాశ్‌బాబు తిరస్కరించినట్లు పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్పీల బదిలీలను ప్రభుత్వం చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా విజయవాడ దిశ డీఎస్పీగా పనిచేస్తున్న కే.ప్రకాశ్‌బాబును రాజంపేట డీఎస్పీగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఈయన అధికారపార్టీకి అనుకూలంగానే ఉంటాడంటూ బదిలీ చేసినట్లు ప్రచారం జరిగింది. అయితే రాజంపేటకు రావడానికి ప్రకాశ్‌బాబు అంగీకరించలేదు. పైగా ఈయన భార్య రాజంపేటకు చెందిన వారే కావడం గమనార్హం. సబ్ డివిజన్‌లో అధికారపార్టీతోపాటు తన సామాజికవర్గం తాకిడి ఎక్కువగా ఉంటుందనే భావనతో ఆయన వెనకడుగువేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. దీంతో టీడీపీ వర్గాల్లో నిరాశ నిస్పృహలు అలుముకున్నాయి.

సమావేశం నిర్వహణకు సహకరించాలి

రాయచోటి : పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహణకు సహకరించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్‌కు మండల ఎంపీటీసీ సభ్యులు గురువారం విన్నవించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు గురువారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. టీడీపీ నాయకులు చెప్పినట్లు విని మెజార్టీ సభ్యులను కాదని సమావేశాన్ని వాయిదా వేయడం తగదన్నారు. కొంతమంది అధికార పార్టీ మూకలు ఆందోళన చేస్తూ భయానక వాతావరణం కల్పించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మహమ్మద్, వైస్ ఎంపీపీ శోభ, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుబ్బిరెడ్డి, కో-ఆప్షన్ ఖాదర్‌వలి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కేవీ.రమణ పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నవోదయలో ముగిసిన అథ్లెటిక్ మీట్

రాజంపేట : జవహర్ నవోదయ విద్యాలయంలో జరుగుతున్న క్లస్టర్ స్థాయి అథ్లెటిక్ మీట్ గురువారం ముగిసింది. నవోదయ కడప క్లస్టర్‌లో కబడ్డీ, కోకో, చెస్, యోగ, టేబుల్‌టెన్నిస్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. కడప, అనంతపురం, నెల్లూరు, కర్నూలు, ప్రకాశం-2, చిత్తూరు, కరైకల్, పుదుచ్చేరికి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ గీత, సంయుక్తా రాణి, అన్నాదురై, యాస్మిన్ మాట్లాడుతూ మీట్‌లో గెలిచిన విజేతలు ఈ నెల 12, 13వ తేదీలలో నవోదయ విద్యాలయాల్లో జరిగే రీజనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఎంపికైన విద్యార్థులు వీరే..

క్లస్టర్ లెవల్ ఫీల్డ్ గేమ్స్‌లో పలువురు విజేతలుగా నిలిచారు. కోకో(అండర్ 14, 17, 19)విభాగం నుంచి ఎంపికైన 72 మంది కర్ణాటక రాష్ట్రం బాగల్‌కోట్ నవోదయ విద్యాలయంలో జరిగే రీజియన్ పోటీల్లో పాల్గొంటారు. కబడ్డీ విభాగం(అండర్ 14, 17, 19)లో 72 మంది కాకినాడ, ఈస్ట్‌గోదావరి నవోదయ విద్యాలయంలో జరిగే రీజియన్ పోటీలకు హాజరవుతారు. బ్యాడ్మింటన్ క్రీడా విభాగం(అండర్ 14, 17, 19)లో 23 మంది పుదుచ్చేరి నవోదయ విద్యాలయంలో జరిగే రీజియన్ పోటీల్లో పాల్గొంటారు. టేబుల్ టెన్నిస్ విభాగం(అండర్ 14,17,19)లో 12 మంది, చెస్(అండర్ 14, 17, 19) విభాగంలో 12 మంది, యోగ విభాగంలో(అండర్14, 17, 16) 30 మంది, క్రికెట్ విభాగంలో ఆరుగురు రీజియన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.


విజేతలతో నవోదయ విద్యాలయ సిబ్బంది

ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రైల్వే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా రైల్వే స్టేషన్‌లో పనులు కొనసాగించాలని గుంతకల్లు డీఆర్‌ఎం విజయ్‌కుమార్ ఆదేశించారు. కడప రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అమృత్ భారత్ స్టేషన్ పనులను గురువారం ఆయన అకస్మికంగా పరిశీలించారు. డిప్యూటీ స్టేషన్ మాస్టర్ కార్యాలయంలోని సిగ్నలింగ్ వ్యవస్థను తనిఖీ చేశారు. రైల్వేలో సిగ్నలింగ్ వ్యవస్థ అత్యంత కీలకమైనదని, అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. కడప రైల్వే స్టేషన్‌లో ఎస్కలేటర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎక్కడ వస్తాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.